క్లుప్తంగా

ప్రాథమిక హక్కులకు భంగం కలిగించరాదు

సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు



గురజాల : ప్రాథమిక హక్కులకు ఎవరూ భంగం కలిగించకూడదని సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు సూచించారు. స్థానిక నవోదయ జూనియర్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే రిట్ పిటిషన్ ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధుల గురించి వివరించారు. వివాహ రిజిస్ట్రేషన్, నిర్బంధ విద్యా హక్కు చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు, షేక్ జానీబాషా తదితరులున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలి

వ్యవసాయాధికారి సంధ్యారాణి




గురజాల రూరల్ : వ్యవసాయాధికారుల సలహాలు సూచనలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎం.సంధ్యారాణి సూచించారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 1, 3 సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడం వంటివి అధికారులు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పలు పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



గురజాల : స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్యాండిల్ సర్వీస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని, క్రైస్తవులంతా ఎంతో పవిత్రతతో ఈ పండుగ నిర్వహించు కుంటారన్నారు. ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగిన ఏసు మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రేమ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్తపల్లి అబ్రహం, చందాల మరియబాబు, ఆంద్రెయ్య, వి.సామ్‌సోన్, నవులూరి శ్రీరామమూర్తి, బుల్లయ్య, న్యాయవాది కత్తి చలమరాజు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రాథమిక కర్తవ్యం



కారెంపూడి: మరుగుదొడ్ల వారోత్సవాల చివరి రోజు మంగళవారం కారెంపూడి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభల్లో మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి పాల్గొని మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన ప్రాథమిక కర్తవ్యమని, కానీ దురదృష్టవశాత్తూ దానిని మనం విస్మరిస్తున్నామని, ఆ పని పంచాయతీ కార్మికులు చేస్తారనే భావనలోకి వెళ్తున్నామని, అలా ఎవరూ చేయవద్దని, అలాగే ప్రభుత్వం కల్పించిన ప్రాథమిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఇంటిని, పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను ప్రతి ఒక్కరు గుర్తించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామంలో తమ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకుని పరిసరాల పరిరక్షణలో తమ వంతు పాత్రను పోషిస్తున్న ఇద్దర్ని గుర్తించి వారిని మండల ప్రత్యేక అధికారి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ కె.సుబ్బారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాలున్నాయి.. సేవలు లేవు

- దుర్గి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి
- గత ప్రభుత్వంలో లక్షల రూపాయలతో మౌలిక వసతుల కల్పన
- సక్రమంగా అందని వైద్య సేవలు

ప్రజారోగ్యమే ప్రాధాన్యతా అంశంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలకు పైగా వెచ్చించి ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించింది. అలాగే ఆసుపత్రుల్లో 24 గంటలూ సేవలందేలా వైద్యులను, వైద్య సిబ్బందిని కూడా నియమించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేవి. దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కూడా ఆ కోవలోకే వస్తుంది. గతంలో వైద్య సేవలతో నిత్యం రద్దీగా ఉండే దుర్గి పీహెచ్‌సీలో నేడు సౌకర్యాలున్నా.. కనీస సేవలు కూడా సక్రమంగా అందడం లేదు.

దుర్గి: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా ఉండాల్సి ఉన్నా.. స్థానిక వైద్య సిబ్బంది మాత్రం రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందించకపోవటం ఎంతో బాధాకరమని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా దుర్గి పీహెచ్‌సీలో స్థానికంగా పని చేస్తున్న వైద్య సిబ్బందిపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో పని చేయాల్సిన వీరు స్థానికంగా ప్రైవేటు క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వస్తున్న రోగులను వారి క్లినిక్‌లకు, వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు.

■ గతంలో ఇక్కడ కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు సహా అన్ని రకాల వైద్య సేవలు అందేవి. కానీ నేడు ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులు లేవంటూ సాకులు చెబుతూ గర్భిణులను ప్రైవేటు క్లినిక్‌లకు తరలించి లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారు. అలాగే ఆడపిల్ల అని తెలిస్తే వైద్యులు తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి చట్ట వ్యతిరేకంగా గర్భస్రావాలు చేసిన ఉదంతాలూ కోకొల్లలు ఉన్నాయి. అలాగే ఇక్కడకు వైద్యం కోసం వచ్చిన వారిని మాచర్ల తదితర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు.

■ దుర్గి ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిపై ఆరోపణలు రావటంతో డీఎంహెచ్‌ఓ దుర్గిలో పర్యటించి తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఏ చర్యలు తీసుకోకుండా వెళ్లినట్లు ఆరోపణలున్నాయి. కేవలం మెడికల్ సూపర్‌వైజర్‌ను డిప్యూటేషన్‌పై పంపటం తప్ప తదుపరి చర్యలేవీ లేవు.

■ ఆరు పడకల ఆసుపత్రిగా ఉన్న దుర్గి పీహెచ్‌సీకి ప్రతి రోజూ సుమారు 100 ఓపీలు వస్తుంటాయి. గతంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఆకస్మిక మరణం చెందిన డాక్టర్ సతీష్ స్థానంలో ప్రసవాలు చేసే వైద్యులు పూర్తి స్థాయిలో విధులు నిర్వర్తించటం లేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు కూడా పూర్తిగా కుంటుపడ్డాయి.

■ గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు వెచ్చించి ఆసుపత్రికి మౌలిక వసతులు కల్పించినప్పటికీ పూర్తి స్థాయిలో ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటంలో నేటి పాలకులు విఫలమైనట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆసుపత్రిపై దుర్గి, ధర్మవరం, అడిగొప్పల, ఓబులేశునిపల్లె, శ్యామరాజుపురం, రాజానగరం, గజాపురం తదితర గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి ఆసుపత్రిపై నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దుర్గి ప్రభుత్వాసుపత్రి



సుందరంగా ఆసుపత్రి ప్రధాన రహదారి



ఆసుపత్రి ప్రాంగణంలో అంబులెన్స్‌లు

స్థానికంగా ఆసుపత్రి ఉంటే మేలు



మేము రోజు వారీ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాం. మాకు అనారోగ్యం వస్తే స్థానికంగా ఆసుపత్రి ఉంటే ఎంతో మేలు చేకూరుతుంది. గత కొంతకాలంగా సుగరుకు మందులు వాడుతున్నాను. అన్ని వసతులతో ఆసుపత్రి నిర్మించటం చాలా సంతోషంగా ఉంది. అంతే స్థాయిలో వైద్య సేవలు ఉండాలని కోరుకుంటున్నాను.

– వేల్పుల వెంకటేశ్వర్లు, దుర్గి

క్లిష్ట పరిస్థితుల్లో వైద్య సేవలందించాలి



అర్ధరాత్రి అకస్మాత్తుగా గర్భిణులకు నొప్పులు వచ్చినప్పుడు మాకు ఈ ఆసుపత్రే దిక్కు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వైద్య సేవలందించి తల్లీ బిడ్డ ప్రాణం సురక్షితంగా ఉండేలా వైద్యం చేయాలని కోరుకుంటున్నాం. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న మహిళలకు రక్షణగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం బాగుంది. అవి పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– డి.లక్ష్మమ్మ, పోలేపల్లి

కంభంపాడులో ముగిసిన పింఛన్ల పరిశీలన



మాచర్ల రూరల్: ఎన్నికలలో ఓట్లు, సీట్లు కోసం ఇప్పటికే ఇచ్చిన హామీలను అమలు చేయలేక ముఖం చాటేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా అవ్వతాతల, వికలాంగుల, హరిజన, గిరిజన బడుగు వర్గాల పింఛన్‌లను తొలగించేందుకు సిద్ధమైంది. పింఛన్‌ల పరిశీలనకు పల్నాడు జిల్లాలోని మాచర్ల మండలంలోని కంభంపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మంగళవారం 2వ రోజు పింఛన్‌ల పరిశీలనకు అధికారులు 12 బృందాలుగా ఏర్పడి పింఛన్‌ల ఏరివేత కోసం జల్లెడ పడుతూ ప్రతి పింఛన్ దరఖాస్తును పరిశీలించి మొబైల్ యాప్‌లో ప్రశ్నలకు జవాబులు అప్‌లోడ్ చేశారు.

22న స్కాలర్‌షిప్ టెస్ట్

పిడుగురాళ్ల: దొప్పలపూడి దేవరత్నం మెమోరియల్ స్కాలర్‌షిప్ టెస్ట్ 2024, ఈ నెల 22వ తేదీన పట్టణంలోని లెనిన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత సబ్జెక్టుపై నిర్వహించటం జరుగుతుందని పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత మాస్టర్ దొప్పలపూడి దేవరత్నం స్మారకార్థం మదర్ థెరిస్సా సేవా మిత్ర మండలి, ఉపాధ్యాయ మిత్ర మండలి సహకారంతో లెనిన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణిత పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. అలాగే ఈ స్కాలర్‌షిప్ టెస్ట్ పల్నాడు స్థాయిలో నిర్వహించబడుతుందని, ఈ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 మంది విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశం ఉందని, ప్రవేశం ఉచితమన్నారు. విజేతలకు బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. పల్నాడులోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ బాషా



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ బాషా

వెల్దుర్తి: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపాడు గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలలో రైతులు, భూ యజమానుల డాక్యుమెంట్స్ వెరిఫై చేసి కరెక్ట్‌గా ఉన్నాయో లేదో చూసి ఎవరైనా గ్రీవెన్స్ చేయటానికి ఈ రెవెన్యూ సదస్సు తోడ్పడుతుందన్నారు. మండలంలోని రోజుకొక గ్రామంలో సభ ఏర్పాటు చేయటం జరుగుతుందని సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆ గ్రామంలోనే అందుబాటులో ఉంటారన్నారు. భూ అంశాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన అంశాలను అడంగల్, 22ఏ, అసైన్డ్ ల్యాండ్ సమాచారం, సభ్యులు తయారు చేసి గ్రామాలకు తీసుకెళ్లటం జరుగుతుందన్నారు. రైతులు, ఇతర ల్యాండు యజమానులు రికార్డులను సరి చూసుకొని ఏమైనా తేడాలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు జరిగే గ్రామంలో ఆ రోజు సబ్ డివిజన్, మ్యుటేషన్ కొరకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గుండ్లపాడు రెవెన్యూ సదస్సులో 6 అర్జీలు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వలి, వీఆర్‌ఓలు మల్లిఖార్జున రెడ్డి, యలమంద, శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబునాయక్, టీడీపీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, తోట వీరాంజనేయులు, యర్రంశెట్టి మార్కొండయ్య, కొండ్రూ మధు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

45 రోజుల్లో సమస్యలు పరిష్కారం

తహసీల్దార్ నగేష్

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.నగేష్ కోరారు. మంగళవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా నీటి వనరుల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ (భూములు) కు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చిన 45 రోజుల్లో కచ్చితంగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యలపై ప్రజలు దళారులను ఆశ్రయించవద్దని నేరుగా అధికారులను సంప్రదించి అర్జీ అందజేయాలని కోరారు. అర్జీలకు బాధితులు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఉచిత సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. గ్రామస్తులు 9 అర్జీలు అందజేసినట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎంపీడీఓ సరోజినిదేవి, డిప్యూటీ తహసీల్దార్ పిన్నెం బ్రహ్మయ్య, ఆర్‌ఐ పల్లా రామకృష్ణ, ఈఓ గాదె రామిరెడ్డి, వీఆర్వో పగడాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.



జెట్టిపాలెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ నగేష్



కంభంపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వాణి

రెవెన్యూ సదస్సులో 22 అర్జీలు



దాచేపల్లి : మండలంలోని భట్రుపాలెం, కాట్రపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మంగళవారం జరిగాయి. తహసీల్దార్ వైవీ కుటుంబరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సుల్లో భట్రుపాలెంలో 14, కాట్రపాడులో 8 అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయటంతో పాటు పొలాల గట్ల సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రాజు, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం

తహసీల్దార్ బత్తుల వాణి

మాచర్ల రూరల్: గ్రామ స్థాయిలో భూములకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామ సదస్సులో ఆమె ప్రజలతో మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించిన మ్యుటేషన్, ఎల్‌ఈసీ కార్డుల మంజూరు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, 22ఏ భూముల వివాదాలు, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిశీలించి దరఖాస్తుదారుకు పూర్తి న్యాయం చేసేలా రెవెన్యూ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో 13 అర్జీలు అందినట్లు తెలిపారు. ఆర్‌ఐ భాస్కర్, వీఆర్‌ఓ, గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్జంపాడులో చోరీ

మాచవరం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యారం నరసింహారెడ్డి రోజులాగే ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. పొలం పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి, అందులో దాచిన రూ.3.50 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పునీత అంతోని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఫాదర్ అంతోనిరాజు



సమిష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ అంతోనిరాజు, ఫాదర్ అగస్టీన్

రెంటచింతల: దైవ ప్రేమచే జ్వలించిన పునీత అంతోని జీవితాన్ని ప్రతి ఒక్క క్రైస్తవుడు ఆదర్శంగా తీసుకుని ఇతరుల పట్ల సోదర ప్రేమ కలిగి ఉండాలని తాళ్లచెరువు విచారణ గురువులు రెవ.ఫాదర్ పుట్టి అంతోనిరాజు కోరారు. స్థానిక అంతోని వారి చర్చిలో 9 మంగళవారాలను పురస్కరించుకుని కానుక మాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి నేతృత్వంలో సహాయక గురువులు ఫాదర్ అగస్టీన్‌తో కలసి ఆయన 8వ మంగళవారం సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా రెవ.ఫాదర్ అంతోనిరాజు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పునీత అంతోని నిరాడంబరమైన ప్రేమికుడని, దయగల హృదయంతో అవసరమైన వారికి సహాయం చేయడానికి నిజమైన స్నేహితుడన్నారు. కతోలికుల విశ్వాసం నుంచి దూరంగా వెళ్లిన వారికి దయ చూపడానికి మన దైవిక రక్షకుడైన ఏసుక్రీస్తు పునీత అంతోనిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలిలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ పూజాబలిలో మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు



కోతకు వచ్చిన వరి పంట

- వరి నూర్పిడి పనుల్లో రైతులు బిజీబిజీ
- ఆశాజనకంగా దిగుబడి



కోసి ఆరబెట్టిన వరి కంకులు



కంకులను తీసుకువెళ్తున్న కూలీలు

పిడుగురాళ్ల: వర్షాలు కురవటం, పత్తి, మిరప పంటల్లో ఆశించిన విధంగా దిగుబడి రావటం లేదని రైతులు ఖరీఫ్‌లో వరి సాగుపై దృష్టి సారించారు. ఈ విధంగా మండలంలోని ఎక్కడ చూసినా వరి పంట కోత దశకు చేరుకుంది. దీంతో రైతులు సైతం ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి పంట కోతకు రావటంతో గతంలో ఎక్కువగా యంత్రాలతో వరి కోతలు కోయించి వెంటనే ధాన్యాన్ని ఆరబెట్టేవారు. అయితే యంత్రానికి కూడా ఖర్చు ఎక్కువ అవటంతో పాటు గడ్డి ముక్కలుగా అవుతుండటంతో రైతులు వరి కోత మిషన్ నుంచి కాకుండా పాత పద్ధతిలోనే కొడవళ్లతో వరి కోతలను కోయిస్తున్నారు. కోసిన వరి కంకులను పొలంలోనే ఆరబెడుతున్నారు. పూర్తిగా వరి కంకులు ఎండిన తర్వాత వరి కంకులను మూటగా కట్టి వాటిని నూర్పిడి చేసేందుకు కల్లాల్లో రాశులుగా పోసి ట్రాక్టర్ సహాయంతో వరి కుప్పలను తొక్కిస్తున్నారు. ఇలా చేయటం వలన ధాన్యం గింజలు వృధా అవ్వవని, వరి గడ్డి కూడా పశువుల మేతకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ఈ ఏడాది దిగుబడి ఆశించినంత ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మిరపలో వైరస్ నివారణకు చర్యలు తీసుకోవాలి

ఉద్యాన శాఖాధికారి సురేష్



మండాదిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి సురేష్

వెల్దుర్తి: మిర్చి పంటకు సోకే వైరస్ వ్యాధిని నివారించేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మండాది, ఉప్పలపాడు, బోదిలవీడు గ్రామాలలో మిరప పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం మిరప పూత, కాయ ఎదుగుదల దశలో ఉందన్నారు. పంట దశలో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించటం జరిగిందన్నారు. ఆకుముడత వైరస్, బొబ్బర తెగులు అనేది తెల్లదోమ ఉధృతి వలన వస్తుందని, కావున రైతులు నివారణకు పసుపురంగు జిగురు అట్టలు ఎకరాకు 20 నుంచి 30 ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెగులు సోకిన మొక్కలను గుర్తించి ప్రారంభ దశలోనే పీకి కాల్చేయన్నారు. తెల్లదోమ ఉధృతిని నివారించటానికి పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న బంతి మొక్కలను మూడు వరసలు నాటుకోవాలన్నారు. మిరప పూతలో నల్లతామర పురుగు ఉన్నట్లు గమనిస్తే నివారణకు ఎకరాకు 2 క్వింటాళ్ల వేప పిండి భూమిలో వేయాలన్నారు. పురుగు నివారణకు ఎరువులను అధిక మోతాదులో వాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

హోమాలు.. స్వాములకు సద్ది వితరణ



రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో మంగళవారం వేద పండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో హోమాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 24వ రోజు రెంటచింతల గ్రామానికి చెందిన అమర్నేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు 380 మంది స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా జల వనరుల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసరావు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి స్వామి, కట్టమూరి శ్రీనివాసరావు గురుస్వామి, బరువు శివారెడ్డి, కె.సైదులు స్వామి, గుండా రాము ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాన్ని డిసెంబర్ 26 వరకు నిర్వహించనున్నట్లు సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు.